సైనిక సమాచార్ వారపత్రిక: 12-3-1961

# జారుడు రాళ్ళు

అక్కడి కెళ్ళినరోజే నరసింహులు అప్తుడయ్యాడు!

ఛార్జి తీసుకుంటున్న రోజు సాయంత్రం పోర్టర్లనందర్నీ పిలిపించాడు రామనాధంగారు.

రామనాధంగారు పెద్ద మాస్టరు.

నేను చిన్న మాష్టర్ని అంటే నాది నైట్ డ్యూటీ!

స్టేషన్‌లో వున్న పోర్టర్లంతా వచ్చి వరుసగా నిలబడ్డారు.

అందులో నరసింహులొకడు!

అందరూ నమస్కారం చేశారు, నరసింహులు కూడ.

కానీ నరసింహులు, అదోలా చూస్తూ చేశాడు.

తన పని అయిపోయినట్లు చూశారు రామనాధంగారు.

ఆయనింకా నాలుగేళ్ళలో మాజీ స్టేషన్ మాస్టరవుతారు.

"మరి నేవెళ్తా! ఎనిమిది గంటల ప్యాసింజరు టైముకొస్తాలే!"

అలాగేనన్నట్లు తలూపా!

"పూజా అదీ చేసుకోవాలి!" అనుకుంటూ వెళ్ళాడు!

రామనాధం పిచ్చికంత మనిషి! అందువల్ల బొద్దుగా వున్నట్లు అవుపిస్తాడు. కళ్ళు వెళ్ళు కొచ్చినట్లుంటాయి! పళ్ళు అక్కడోటీ, యిక్కడోటీ వుంటాయి! తలంతా తెల్లబడి జుట్టంతా వూడిపోయింది. నలుగురు పిల్లల తండ్రి!

జారిపోయే లాగును పట్టుకుని ఫ్లాట్‌ఫారం మీదుగా వెళ్ళిపోయాడు ఇంటి వేపు రామనాధం!

ఆయనటు వెళ్ళగానే, పోర్టర్లంతా ఎవరి పనుల్లోకి వాళ్ళెళ్ళారు! ఒక్క నరసింహులు తప్ప! నా వెంట రమ్మన్నా!

స్టేషన్‌లో కెళ్ళి కుర్చీలో కూర్చున్నా.

నరసింహులు నిలబడ్డాడు, గడపనానుకుని!

"ఎన్నేళ్ళబట్టీ యిక్కడుంటున్నావు?" అని ప్రశ్నించా బయటకు చూస్తూ! బయట అంటే స్టేషన్ చుట్టు మంచి సీనరీ వుంది.

"పెళ్ళయినదగ్గర్నుంచీ!"

నా కర్థంగాలా!

మనిషినిచూస్తే నడికారు మనిషి. ఎలా అతని వయస్సు అంచనా వేసుకునేది?

"రామనాథంగారు మంచివారేనా?"

ఇదంతా కాలక్షేపం కోసం చేసే ఊకదంపుడు.

"మీకు పెళ్ళయిందా?" నరసింహులడిగాడు!

అతడి ప్రశ్నకు, మాట్లాడే తీరుకు ఆశ్చర్యమేసింది.

"కాలేదు."

"అయితే మీకేం ఫర్వాలేదు!"

ఇదీ అర్థంగాలేదు.

"పెళ్ళయితే....?"

"కాలేదుగా! ఉంటారుగా చూడకపోరు!"

చాలా వింత మనిషి నరసింహులు!

అందుకేనేమో నచ్చాడు నాకు!

కాసేపుండి వెళ్ళాడు.

చిన్న స్టేషను!

పని తక్కువ. రోజుకు నాలుగు బండ్లకన్నా ఎక్కువ రావు! దిగేవాళ్ళూ లేరు, ఎక్కేవాళ్ళూ లేరు!

ఓ గుట్ట ప్రక్కగా కట్టారు స్టేషను. స్టేషనుకు ఉత్తరంగా పెద్ద చెరువు. చెరువు గట్టున సత్రమొకటి!

అంతా పది యిళ్ళక్కడ - అవీ పోర్టర్లవీ, మాస్టర్లవీ మాత్రమే. యింకో ప్రాణి లేదక్కడ!

ఐదింటికే చీకటి పడ్డది.

ఉదయం నుంచీ ఒకటేమైన మబ్బులు క్రమ్ముకుంటున్నయ్ ఆకాశాన! వాన రావచ్చు.

పోర్టర్లు లైట్లు ముట్టించారు!

ఔటర్ సిగ్నల్ వేపు లాంప్ తీసుకువెళ్తున్నారిద్దరు.

గంగరావి చెట్టు దగ్గరున్న సిమెంటు బెంచీ మీద యిద్దరు పోర్టర్లు కూర్చుని పులి జూదం ఆడుతున్నారు. పోర్టర్ల యిళ్ళ దగ్గరగా పిల్లలు గోలగా ఆడుకుంటున్నారు.

క్రొత్త కావటం వల్ల ఏదోలా వుంది!

పది మైళ్ళ దాకా టౌన్ లేదు. దరిదాపులో పల్లెగూడ లేదు.

ఈ స్టేషన్‌లో యింజన్ నీళ్ళు నింపుకుంటుంది.

స్టేషన్‌లోకెళ్ళి డ్రాయర్లోంచి, 'రెబెకా' తీసి చదువుతూ కూర్చున్నా! ఐదు నిమిషాల తక్కువ ఎనిమిదింటికి రామనాథంగారొచ్చారు.

వస్తూనే, "చదువుకుంటున్నావా? ఏమిటది?" అనడిగారు.

నా సమాధానం వినకుండానే, "వీళ్ళంతా ఎక్కడ చచ్చారు! ఒరేయ్ వీరాయ్! రాఘ

వలూ!" అని కేక వేశాడు.

వాళ్ళనవీ యివీ అడిగాడు.

"వచ్చేది ప్యాసింజరు. వాటరింగు అదీ అయ్యేసరికి ఓ పదిహేను నిముషాలుంటుంది. క్రొత్తగదూ, గార్డుకీ, వాళ్ళకీ పరిచయం చేస్తా!"

ఓ పది నిమిషాలకు సిగ్నల్ యిచ్చాం.

పదిమంది ప్యాసింజర్లకు రాఘవులు టిక్కెట్లిస్తున్నాడు.

లైన్ క్లియర్ తీసుకు వీరాయి "అప్" కెళ్ళాడు.

నేను కోటు వేసుకు తయారైనాను.

ఇంతలో ట్రెయిన్ రానే వచ్చింది. పిల్లల తల్లిలా!

ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళు తక్కువవటం వల్ల పెద్ద గందరగోళమేం లేదు.

యిద్దరం గార్డ్ బ్రేక్ వేపు బయలుదేరాం.

"రామనాథం సాబ్!" ఎవరో కేకేశారు.

పాతికేళ్ళ ఆడమనిషిని, టికెట్ కలెక్టర్ రెక్కపుచ్చుకు లాక్కొస్తున్నాడు మా వేపు.

"దీనికి సిగ్గులేదు!" - రామనాథంగారు గొణుక్కున్నాడు!

"దీన్ని రైలెక్కకుండా, మీరు బాధ్యత పుచ్చుకోండి. దొంగలం-"

ప్రక్కన నేనుండటం చూసి ఆగాడు, సందేహంగా!

"అలాగే!" అని "ఈయన రావు మా అసిస్టెంట్" నన్ను పరిచయం చేశారు.

నమస్కారం చేశా!

"రహంతుల్లా! చెప్పేదేముంది!"

చిన్నగా నవ్వాను.

"టుడే జాయినా? గుడ్!" అని విష్ చేశాడు.

యింతలో గార్డు, యింకా యిద్దరు టికెట్ కలెక్టర్లు మా దగ్గరికొచ్చారు.

వాళ్ళకీ పరిచయం చేశాడు రామనాథంగారు!

గార్డు పేరు విలియమ్స్, నవ్వుతూ "లక్కీమాన్ మిష్టర్ రావు" అంటూ భావయుక్తంగా రామనాథం వేపు కన్ను గీటాడు నాకు!

రామనాథంగారు తప్ప అంతా నవ్వారు, అతని మాటకు!

మరో పది నిముషాలకు ట్రెయిన్ వెళ్ళిపోయింది.

రహంతుల్లా లాక్కొచ్చిన ఆడమనిషి మాత్రం మా ముందునుంచి పోలా!

మనిషి చావతేలి, సడింపుగా వుంది. అందమైనది లాగానే వుంది!

రామనాథంగారు దానివేపు అదోవిధంగా చూస్తూ, "యింకా యిక్కడే తగలడ్డావేం? పో! ఆ సత్రంలోనే ఎక్కడో చావు!"

ఆమె వెళ్ళిపోయింది చీకట్లోకి!

గేటు దగ్గరున్న నరసింహులు ఎందుకో కిసుక్కున నవ్వాడు.

రామనాధంగారు కోపంగా వాడివేపు చూస్తూ, 'సిగ్గులేదు!' అనుకుని. "ఆ వస్తారుగా! వాళ్ళకప్పజెప్పి రాండి, ప్రొద్దునెప్పుడు భోజనం చేశారో!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆయనెళ్ళంగానే నరసింహుల్ని పిలిచా.

టిక్కెట్లు పుచ్చుకు వచ్చాడు.

"ఎందుకు నవ్వావు? ఆయనెందుకు కోపంగా చూశాడు?"

నా కళ్ళల్లోకి నిశితంగా చూశాడు! అందులో నా నిజాయితీని, కొలుస్తున్నాడు గామాలు!

"ఇందాకెళ్ళిందాన్ని చూశారుగా!"

"ఊ!"

"ఎట్లా వుంది?"

"బాగానే వున్నట్లుంది!"

నవ్వాడు!

"దాని పేరు రాజులు!"

"అయితే!"

"దానితో చీకటి తప్పు చెయ్యినోళ్ళు లైను మీద అరుదు! దాన్ని చూస్తే రామనాధంగారికి మనసు!"

నేనేం మాట్లాడలా!

"వివరాలు చెప్తాలేండి! పదండి వెళ్దాం భోజనానికి!"

స్టేషన్నుంచి నేనూ, నరసింహులు బయలుదేరాం!

ఆవరణ కవతలగా ఓ పోర్టరును అడుగుతోంది రాజులు, "కొత్తాయనా?" అని!

"ఇహ, ఎళ్ళహే! ఆయన్సంగతి తెల్దుగామాలు. ఆ చాయల కెళ్ళమాకు!" అని కసురుకుంటున్నాడు.

మా అలికిడి విని చీకట్లోకి దూరారు!

"చూశారా!" అన్నట్లు నవ్వుతూ చూశాడు నరసింహులు.

రామనాధంగారి శ్రీమతి వరండాలో కూర్చున్నది మ్యాగజైన్ చూస్తూ!

మమ్మల్ని చూసి, "రాండి, మీ కోసమే చూస్తున్నా!"

నరసింహులు బయట కూర్చున్నాడు, నే భోజనం చేసిందాకా!

భోజనం అయివచ్చేప్పుడు రామనాధంగారు తమ శ్రీమతి యామినిని, సంతానాన్ని పరిచయం చేశారు. ఆమె వారి మూడో భార్య!

నిస్సంకోచంగా షేక్‌హ్యాండ్ ఇస్తూ, చెయ్యి గీరింది భావయుక్తంగా!

............

దారిలో నరసింహులు, "సంగతులు చెప్పండి" అనడిగాడు!

నేనేం మాట్లాడలా!

"మీరు చెప్పకపోయినా తెలుసు!"

విచిత్రంగా చూశా అతని వేపు.

"మీకు పెళ్ళయిందా? ఆస్తెంత? కులం, గోత్రం!..... అంతేగదూ?"

నాకు రాను రాను ఆశ్చర్యం, విసుగు పుట్టినయ్! మాయా ప్రపంచంలా వుంది. యిక్కడ మనుషులు. వాతావరణం!

"యివన్నీ నీకెలా తెలుసు?"

నవ్వాడు! గుబురుగా వున్న మీసం మెలితిప్పుకున్నాడు.

"పదండి చెప్తా!"

స్టేషను కెళ్ళాం! నరసింహులు బెడ్డింగ్ పరిచాడు. చొక్కా విప్పేసి సిగరెట్ ముట్టించుకు కూర్చున్నా చెప్పమన్నట్టు. తెల్లవారుఝామున మూడు గంటలదాకా పనిలేదు.

"యింతకు ముందొక అసిస్టెంట్‌గారుండేవారు! చాలా తెలివైనవాడు. ఆయన్ను యిలాగే మిమ్మల్నడిగినట్టే అడిగారు. ఆయన అన్నీ గ్రహించి అన్నిటికీ వూ అన్నాడు! యింకేముంది రాత్రిళ్ళు, యిక్కడే అమ్మగారు, అయ్యగారు...." కిసుక్కున నవ్వాడు!

"అమ్మగారంటే.....?"

"ఆయనగారి భార్య!"

"నిజంగా!"

"అబద్ధంగాదు! మీకూ అనుభవంగాకపోదు!"

"యింకా...."

"యింకా ఏముంది! తీరా ఆయన భార్య వచ్చేసరికి ఆవిడ ఈవిడ నువ్వెంత, నువ్వెంత అనుకున్నారు!"

"రామనాథంగారు చూస్తూ ఊరుకున్నారా?"

"ఏం చేస్తారు? మూడో భార్య ముద్దుల భార్య. పైగా ఆయనకు రాజులకు...."

"నిజంగానా?"

"ఆహా"

ఆ తర్వాత, అదేపనిగా ఆలోచిస్తూ పక్కమీద వాలా! నరసింహులు తలుపు దగ్గరేసి ఎక్కడికో వెళ్ళాడు.

అంతా ప్రశాంతంగా వుంది. గోడనున్న గడియారం 'టిక్ టిక్' మంటున్నది. ఎక్కడో రెండు కుక్కలు పోట్లాడుకుంటున్నయ్ - జన్మాంతంగా వైరమున్నట్లు.

♦ ♦ ♦

రాఘవులు ఎవరి మీదో అరుస్తుండటంతో మెలకువ వచ్చింది.

"ఛహ! పో అవతలకు! కంటబడ్డ మనిషిని వొదిలి పెట్టవ్! పో ముందు యిక్కణ్ణుంచి!"

"అయ్యగారు రమ్మన్నారు" - ఎవరో చిన్నగా అన్నదా మాటలు!

"ఓసి నీ సిగదరగ కదలే, పీక పిసుకుతా! మాట్టాడావంటే!"

"రాఘవులూ!"

"అయ్యా" అంటూ వచ్చాడు.

షుమారు 11 గంటలైంది.

"మంచినీళ్ళు అందుకో."

రాఘవులెళ్ళాడు తేవటానికి!

సిగరెట్ ముట్టించి, ఫ్లాట్‌ఫారం మీదికి వచ్చా! సన్నగా తుప్పరపడుతోంది. పెద్ద వాన రావచ్చు. కొద్దిగా చలేస్తున్నది.

ఎవరో దగ్గారు!

అటు చూశా!

ఎవరో కదిలారు, బుకింగ్ విండో దగ్గర!

"ఎవరది!"

మాట్లాడలా!

దగ్గరికెళ్ళా! తలొంచుకువుంది రాజులు!

చెయ్యిపుచ్చుకు స్టేషన్ ముందుకు లాక్కొచ్చా!

"ఏ అయ్యగారు నిన్ను రమ్మన్నది!"

"మీరు గాదు!"

"మరి?"

"రామనాథంగారు!"

"వుండరని తెలిసే వచ్చావా?"

మాట్లాడలా!

"ఆయన్తో నీకేం పని?"

"......"

"చెప్పగూడదా?"

రాఘవులొచ్చాడు!

"నువ్వెందుకిక్కడ! ఫో!"

"వుండనీలే! మంచినీళ్ళేవి?"

"అమ్మగారు తెస్తున్నారు!"

రాజులు విచిత్రంగా చూసింది.

"రా! నువ్వెందుకు పానకంలో పుడకలా!"

రాజుల్ని, రాఘవులు చెయ్యిబుచ్చుకు లాక్కెళ్ళాడు!

"అమ్మో!" గాజు పెంకులు క్రిందపడ్డయి!

అప్పటికే రాఘవులు, రాజుల్ని లాక్కెళ్ళాడు, బలవంతంగా!

కాసేపటికి ఫ్లాస్కుతో టీ తీసుకుని యామిని వచ్చింది!

వస్తూనే, "అబ్బా" అని క్రిందికి చూసింది.

గ్రుచ్చుకున్న గాజు పెంకులు కంటబడ్డాయ్!

నా వేపు నిశితంగా చూసింది.

ఫ్లాస్కు టేబుల్ మీద పెట్టి, "అసాధ్యులే!" అంది ఫ్లాస్కు మూతలో టీ పోసి, "నయం తొందర్లో మేలుకున్నా!"

నేనేం మాట్లాడలా!

నరసింహులు తలుపు దాకా వచ్చి, "అయ్యగారూ అవసరమైతే పిలవండి. బెంచీ మీదుంటా!"

టీ త్రాగటం అయింది.

"మంచినీళ్ళు తెమ్మంటే.... టీ వచ్చిందే!"

"ఊ.... మీ మీద ప్రేమ!"

"నిజంగా?"

బుజాలు పుచ్చుకు బుగ్గలు ముద్దెట్టుకున్నా.

"వుండండి తలుపేసొస్తా!"

"అసాధ్యురాలవే!"

తలుపు దగ్గరకెళ్ళి, గబగబా వచ్చి "ఆయనొస్తున్నారు."

నే వెళ్ళా బయటకు, తలుపు దగ్గరకేసి. ఆయన రగ్గు కప్పుకొని వచ్చారు.

"ఉన్నారా, యింకా నిద్రపట్టలా!"

"లేదండి!"

"అవున్లే, యిక్కడ నిద్ర పట్టదు! చూడు నాయనా! పెద్దవాణ్ణి! అనుభవం, వయసు మీద పడుతున్నది, ఒక్కమాట చెప్పమంటావా?"

"చెప్పండి!"

"కొండ మీద నుంచి ఓ రాయి క్రిందకు నెట్టడం తేలికే కదూ?"

"నిజం!"

"కానీ క్రింద నుంచి కొండ మీదకు రాయి నెట్టలేం గదూ?"

"అవును."

"ఓ కథ చెప్పనా?"

"ఊ!"

"అట్లా కూర్చో!"

ఇద్దరం లగేజి తూచే దానిమీద కూర్చున్నాం.

"ఇక్కడికొచ్చి నేను పదేళ్ళు. అప్పుడు ఇక్కడ శాంతమ్మనే పోర్టరు భార్య వుండేది. పోర్టరు చనిపోయాడు. యిక్కడే వుంటూ పని పాటలు చేసుకునేది. దాని కూతురే రాజులు! మావాడు గోపీ రాజుల్ని తీసుకెళ్ళి రహస్యంగా పెళ్ళి చేసుకున్నాట్ట? అంతవరకే తెలుసు! నాకు. శాంతమ్మ గౌరవం మంటకలిసిందని రైలు కిందపడి చచ్చింది. యిహ నా కొడుకు దాన్ని అనుభవించి మోసగించి ఎక్కడికో వెళ్ళాడు. యింతవరకు జాడలేదు. రాజులు ఎన్నో కష్టాలు పడి, క్రమంగా మతి కోల్పోయింది. ఆ తర్వాత వరస వాయి లేదు! అడ్డమైన వాడు దాన్తో అవసరం కొద్దీ వాడుకుంటున్నారు! యిదంతా కథ గాదు నాయనా జీవితం! అందుకనే పైకి రావలసిన వాడివి కాబట్టి గ్రహించుకో! వస్తా!"

ఆయనెళ్ళారు! ఎందుకో బాధ కలిగింది మనసులో!

'లక్కీమాన్' - విలియమ్స్ మాటలు, అందరి నవ్వులాటలు జ్ఞాపకం వచ్చాయి.

గదిలోకెళ్లేసరికి కోపంగా చూసింది యామిని.

"ఆయనకు మతిలేకపోతే మీకైనా వుండొద్దూ!"

"ఏం?"

"ఆయన చెప్పిందంతా శుద్ధ మోసం! రాజులంటే ఆయన ప్రాణం పీకుతుంది. ఆయన్నొదిలేస్తుందని కల్పించిన కథ!"

"నిజంగా?"

"ఆహ!"

ఆ తర్వాత యామిని కౌగిట్లో అన్నీ మర్చేపోయినా!

♦ ♦ ♦

మూడు గంటల ట్రెయిన్ వెళ్ళింతరువాత, నరసింహులు రాజుల్ని లాక్కొచ్చాడు! అది ఏడుస్తున్నది.

"ఇది చూడండి. ఔటర్ దగ్గర రైలు పట్టాల దగ్గర అడ్డంగా పడుకుంది. నే చూశాగాబట్టి సరిపోయె! లేకపోతే?"

"ఎందుకట?"

"అమ్మగారు కొట్టిందట!"

"ఎందుకు?"

"ఏమో?"

"పూరికెనే, మీ గదిలో కెళ్ళావా లేదా అని అడిగారు! ఎళ్ళానంటే కొట్టింది!"

"సరే వెళ్ళు!"

నరసింహులు నన్ను చూసి, "చూశారా, మాయాప్రపంచం!"

ప్రపంచం మాయ అయినా కాకపోయినా నాకు అంతా మాయగా వుంది! •